క్లుప్తంగా

26న జిల్లాస్థాయి హిందీ ప్రతిభ పరీక్ష

రాజంపేట టౌన్ : పట్టణంలోని మన్నూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 26వ తేదీ ఉదయం 10 గంటల నుంచి టెన్త్ విద్యార్థులకు హిందీ ప్రతిభ పరీక్షను నిర్వహించనున్నట్లు ప్రేమ్‌చంద్ హిందీ భవన్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.సర్తాజ్ హుస్సేన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్‌లో జరగనున్న టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు హిందీ పాఠ్యాంశంలో అత్యుత్తమ మార్కులు సాధించాలన్న ఆశయంతో ఉమ్మడి వైఎస్సార్ జిల్లా స్థాయిలో ప్రేమ్‌చంద్ హిందీభవన్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ ప్రతిభ పరీక్షను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 6303701314 నెంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

శరత్‌కుమార్‌కు వాకర్స్ ఇంటర్నేషనల్ అవార్డు



అవార్డును అందుకుంటున్న శరత్‌కుమార్‌రాజు

రాజంపేట : వైఎస్సార్‌సీపీ సీనియర్‌నేత కొండూరు శరత్‌కుమార్‌రాజుకు వాకర్స్ ఇంటర్నేషనల్ సేవల అవార్డు వరించింది. ఈ అవార్డును తిరుపతిలో వాకర్స్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అందుకున్నట్లు శరత్‌కుమార్ ఇక్కడి విలేకర్లకు తెలిపారు. ఈ అవార్డును ఆ సంఘం అధ్యక్షుడు రవీంద్రరాజు అందజేసినట్లు వెల్లడించారు.

స్కేటింగ్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థికి సత్కారం



హార్థిక్ రెడ్డిని అభినందిస్తున్న దృశ్యం

ఓబులవారిపల్లె : నేపాల్ ఇటీవల జరిగిన అంతర్జాతీయ స్థాయి అండర్-7 స్కేటింగ్ పోటీల్లో మంగంపేట ఏపీఎండీసీ రెండవ తరగతి విద్యార్థి నందలూరు హార్థిక్‌రెడ్డి బంగారు పతకం సాధించాడు. ఆదివారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి ముక్కా సాయివికాష్ రెడ్డి హార్థిక్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో గుంతకల్ రైల్వే డివిజన్ సభ్యులు తల్లెం భరత్ కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తల్లెం చంద్రమోహన్ రెడ్డి, గజ్జల శ్రీనివాసులు రెడ్డి, తల్లెం విష్ణువర్ధన్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

శిల్పారామంలో చిన్నారుల సందడి

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై చిన్నారులు, కళాకారులు తమ ఆటపాటలతో సందడి చేశారు. రాయచోటికి చెందిన డీజే మణి డ్యాన్స్ అకాడమి విద్యార్థులు పలు జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. సామాజిక అంశాలపై పలు కామెడీ స్కిట్‌లను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. శిల్పారామం పాలనాధికారి శివప్రసాద్ రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పాఠశాలల విలీనం ఆపాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రవ్యాప్తంగా 10లోపు విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలల విలీనం కోసం సేకరిస్తున్న వివరాలను తక్షణం ఆపాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శేఖర్, కడప జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామసుబ్బయ్య, సీవీ ప్రసాద్, అన్నమయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అలీఖాన్, చెంగల్‌రెడ్డి డిమాండ్ చేశారు. కడప ఏపీటీఎఫ్ కార్యాలయం వేదికగా ఆదివారం జిల్లాశాఖ సమావేశాన్ని ఆన్‌లైన్ ద్వారా నిర్వహించి రాష్ట్ర విద్యాశాఖ చేపట్టబోతున్న పలు అంశాలపై చర్చించారు. ప్రస్తుత ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలో దాదాపు 177 పాఠశాలలు కనుమరుగయ్యే అవకాశం ఉందని అన్నారు. దీంతో గ్రామీణ, పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు చదువుకు దూరం కానున్నారన్నారు. ఆ విషయంలో ప్రభుత్వం మరోమారు ఆలోచించాలని వారు కోరారు.

కవులకు సన్మానం

మదనపల్లె సిటీ : అంతర్జాతీయ భాష దినోత్సవం పురస్కరించుకుని పలమనేరు తెలుగు సాహితీ సమాఖ్య మదనపల్లెకు చెందిన కవులను సన్మానించారు. ఆదివారం పలమనేరులో జరిగిన కార్యక్రమంలో మదనపల్లె రచయితల సంఘం (మరసం) కార్యదర్శి లింగాల యుగంధరాచారి, సభ్యులు నాగరాజు, రామమోహన్‌నాయుడుకు ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు.

ఘనంగా 'శివాజీ' జయంతి

పీలేరు రూరల్ : పీలేరులో ఛత్రపతి శివాజీ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అజంతామిట్టన ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శివాజీ అభిమానులు మనోజ్‌కుమార్, పూలకుమార్ యుగంధర్, శివ, తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో శైవక్షేత్రాలు కిటకిట

- శివరాత్రి జాగరణకు ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- పలుచోట్ల పుణ్య స్నానాలు చేసిన భక్తులు
- అలరించిన నాటకాలు, సాంస్కృతిక కార్యక్రమాలు



సంబేపల్లె: చిన్నజంగంపల్లెలో అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు



సంబేపల్లె: జరిలో పుణ్యస్నానాలకు పోటెత్తిన భక్తులు



సిద్దవటం: కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

సంబేపల్లె : శైవక్షేత్రం జరిలో మహాశివరాత్రికి భక్తులు పోటెత్తారు. సరిహద్దులలో ఉన్న పవిత్ర బహుదాన దిలో మహాశివరాత్రి రోజున పరమశివుని పవిత్రంగా సేవించి ఉపవాస దీక్షలతో జాగారం చేసి ఈ జరిలో స్నానం ఆచరిస్తే సర్వపాపాలు తొలగి, అష్ట ఐశ్వర్యాలు సిద్ధిస్తాయని పూర్వం నుంచి ఈ ప్రాంత భక్తులలో అపార నమ్మకం. ఈ నేపథ్యంలో ఆదివారం తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో జరికి తరలి వచ్చి అరుణోదయ స్నానాలు ఆచరించారు. అనంతరం సమీపంలోని మల్లికార్జునస్వామికి పూజలు చేశారు. ప్రయాణీకులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏపీఎస్‌ఆర్‌టీసీ అధికారులు బస్సులను నడిపారు. చెక్కభజనలు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. భక్తులకు అన్నదానం నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు కల్పించారు.

ముగిసిన శివరాత్రి ఉత్సవాలు

మండల పరిధిలోని శివసాయి ఆలయం, గుహేశ్వరి పశుపతినాథ ఆలయం, చిన్నజంగంపల్లెలలో మహాశివరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పరమేశ్వరుడికి అర్చన, అభిషేకాలు, రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు ఘనంగా నిర్వహించారు. అనంతరం రాత్రి జాగరణ చేసిన భక్తులు ఆదివారం తెల్లవారుజామున అగ్నిగుండ ప్రవేశం చేశారు.

వైభవంగా కల్యాణం

సిద్దవటం : కపర్థీశ్వర స్వామి ఆలయంలో శనివారం రాత్రి శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. వేద పండితులు రంగయ్యస్వామి మొదట కపర్థీశ్వరస్వామి మూల విరాట్‌కు ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేశారు. అనంతరం స్వామి వారి ఉత్సవ మూర్తులకు వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం ఉత్సవమూర్తుల ఊరేగింపు, శ్రీ సత్య హరిశ్చంద్ర నాటక ప్రదర్శన కార్యక్రమం అలరించాయి.

రేపు కైలాసనాథేశ్వరాలయంలో కల్యాణం

నందలూరు(రాజంపేట) : టంగుటూరులోని ప్రాచీన శివాలయం కైలాసనాథేశ్వరాలయంలో శివపార్వతుల కల్యాణం ఈనెల 21న ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. సాయంత్రం గ్రామోత్సవం ఉంటుందన్నారు. రాత్రికి సత్య హరిశ్చంద్ర నాటకం ప్రదర్శిస్తారన్నారు. 22న మధ్యాహ్నం బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు.

అయ్యవారురెడ్డిస్వామికి పూజలు

సిద్దవటం : మండలంలోని మూలపల్లె గ్రామంలో జీవ సమాధి అయిన అయ్యవారురెడ్డి స్వామికి ఆదివారం భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మహాశివరాత్రి నాడు శ్రీ నిత్యపూజ స్వామిని దర్శించుకున్న భక్తులు ఆదివారం అయ్యవారురెడ్డి స్వామిని దర్శించుకుంటారు. భక్తులు స్వామి వారి సమాధి చుట్టూ ప్రదక్షిణలు చేసి కాయాకర్పూరాలు అందించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు.



చిన్నమండెం: దేవరెద్దుకు పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా పెద్దయ్యస్వామి తిరునాల

చిన్నమండెం : మండలంలోని దేవగుడిపల్లె గ్రామంలో వెలిసిన మాలె పెద్దయ్యస్వామి తిరునాల ఘనంగా నిర్వహించారు. దేవరెద్దుకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు మొక్కుబడులు చెల్లించి స్వామికి పూజలు చేశారు. భక్తులు అన్నదానంలో పాల్గొన్నారు.

సాంప్రదాయం కొనసాగింపు

సంబేపల్లె : ఆ కుటుంబం నాలుగు తరాల నుంచి బాటసారులకు చక్కెర నీటిని అందిస్తూ వారి పూర్వీకుల నుండి వస్తున్న సాంప్రదాయాన్ని నేటికీ కొనసాగిస్తున్నారు. మండల పరిధిలోని దేవపట్లకు చెందిన వెంకటరమణ కుటుంబం శివరాత్రి పర్వదినం నాడు రాత్రి జాగారణ, దర్శనం కోసం వెళ్తూ భక్తులకు ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా చక్కెర నీటిని అందిస్తూ వస్తున్నారు. వీరి కుటుంబం గుట్టపల్లె సమీపంలోని జాతీయ రహదారి వద్ద వాహనదారులకు, బాటసారులకు చక్కెర నీటిని శివరాత్రి, ఆ మరుసటి రోజు రెండు రోజులపాటు అందజేశారు.



సిద్దవటం: అయ్యవారురెడ్డి స్వామికి పూజలు చేస్తున్న భక్తులు



గుట్టపల్లె సమీపంలో భక్తులకు చక్కర నీటిని అందజేస్తున్న వెంకట్రమణ

బి.మఠంలో అట్టహాసంగా కల్యాణోత్సవ వేడుక

బ్రహ్మంగారిమఠం : మహాశివరాత్రి సందర్భంగా స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున మఠానికి తరలివచ్చారు. బ్రహ్మంగారి కల్యాణోత్సవాలు మూడు రోజుల నుంచి వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం మోహినీ అలంకారోత్సవంలో దర్శనమిచ్చారు. భక్తులు దర్శించుకుని భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. ఉదయం ప్రత్యేక పూజలనంతరం స్వామివారు మోహినీ అలంకారంలో పుర వీధుల్లో విహరించారు. మధ్యాహ్నం నామ సంకీర్తన, భజన (పారాయణ) కార్యక్రమాలు చేపట్టారు. రాత్రి నంది ఉత్సవం ఉత్సాహంగా సాగింది. పూర్వపు మఠాధిపతులు శ్రీ వీరబోగ వసంత వెంకటేశ్వర స్వాముల కుమారులు శ్రీ వెంకటాద్రిస్వామి, వీరభద్రస్వామి, వీరంభట్లయ్యస్వామి, దత్తాత్రేయస్వామి, గోవిందస్వామి, వరదరాజులస్వామి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవదాయశాఖ వారు, మఠం నిర్వాహకులు ఏర్పాట్లు చేపట్టారు. బి.మఠం దేవస్థానం ఫిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ, మేనేజర్ ఈశ్వరాచారి, ఉభయదాతలు నెల్లూరు జిల్లా నార్తురాజుపాళెంకు చెందిన బద్వేలి రమణారెడ్డి, దేవమ్మ, మద్రాసుకు చెందిన కన్నయప్పన్, కందిమల్లాయపల్లె పుర ప్రజలు పాల్గొన్నారు. బి.మఠం ఎస్‌ఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

ఈశ్వరీదేవి మఠంలో..

ఈశ్వరీదేవిమఠంలో మహాశివరాత్రి సందర్భంగా శ్రీపార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవాలు మూడు రోజుల నుంచి ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం అభిషేకం, కుంకుమార్చన, ఆవాహిత సర్వదేవతా షోడశోపచార పూజ, రుద్రహోమం, పూర్ణాహుతి, దేవతోద్వాసనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పోరుమామిళ్ల భగవాన్ రమణమహర్షి భక్త బృందం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసింది. రాత్రి పార్వతీపరమేశ్వరుల కల్యాణ మూర్తుల గ్రామోత్సవం నిర్వహించారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు చెప్పిన హరికథా కాలక్షేపం భక్తులను అలరించింది. అనంతరం ఈశ్వరీదేవికి సింహవాహన సేవను నిర్వహించారు.

పీడిత ప్రజల హక్కుల కోసం పోరాటం

రాయచోటి అర్బన్ : దశాబ్దాలుగా పీడిత, తాడిత ప్రజల హక్కుల పరిరక్షణ కోసమే పోరాటం చేస్తున్నట్లు పౌరహక్కుల సంఘం రాష్ట్రసహాయ కార్యదర్శి చీమలపెంట వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణంలో హక్కుల కోసం పోరాడి అమరులైన పౌరహక్కుల సంఘం నేతల చిత్రపటాలతో రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీసీఎల్‌సీ కడప, చిత్తూరు ఉమ్మడి జిల్లాల ప్రధాన కార్యదర్శులు ఆర్.రవిశంకర్, నాగేశ్వరరావు, కడప జిల్లా ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు పి.రెడ్డెయ్య, ఎం.రవిశంకర్, కోశాధికారి వంగిమళ్ళ రమణ, చైతన్య మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.ఝాన్సీలక్ష్మి, పల్లం తాతయ్య, రైతుసంఘం నేత రంగారెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పౌరహక్కుల సంఘం నేతలు

ఘనంగా ఎడ్లబండి పోటీలు



ఎడ్లబండి పోటీలను ప్రారంభిస్తున్న పంజం సుకుమార్ రెడ్డి, రమేష్ రాజు

రైల్వేకోడూరు రూరల్ : రైల్వేకోడూరు మండలంలోని వీపీఆర్ కండ్రిక పంచాయతీ సిద్దులయ్య దేవస్థానం వద్ద ఆదివారం ఎడ్ల బండి పోటీలు ఘనంగా జరిగాయి. సర్పంచ్ శాంతమ్మ, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో జరిగిన పోటీలకు ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి హాజరై స్థానిక పార్టీ నాయకులు రమేష్ రాజుతో కలిసి పోటీలను ప్రారంభించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి ఎడ్లబండ్లు పోటీల్లో పాల్గొన్నాయి. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు, సింగిల్‌విండో ప్రెసిడెంట్ సుదర్శన్‌రాజు, సర్పంచ్ విష్ణువర్దన్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ప్రసాద్ రెడ్డి, శంకర్‌రాజు, హరి తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన మల్లయ్యకొండ ఆదాయం



కానుకల లెక్కిస్తున్న సిబ్బంది

తంబళ్లపల్లె : మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణ సందర్భంగా భక్తులు స్వామి వారికి చెల్లించిన కానుకల ద్వారా ఈ ఏడాది ఆదాయం పెరిగింది. శనివారం రాత్రి శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి వారి కల్యాణోత్సవం, రథోత్సవం కనులవిందుగా సాగాయి. ఉత్సవ విగ్రహాలను రథంలో అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. మల్లయ్యదారులు ఆకర్షణీయమైన వస్త్రధారణతో వెలుగుబంటి టోపీ ధరించి ఢమరఖం వాయిస్తూ , పిల్లనిగ్రోవి ఊదుతూ చేసిన నృత్యవిన్యాసం భక్తులను అలరింప చేసింది. ఆదివారం ఉదయం ఆలయ కమిటీ చైర్మన్ కెఆర్ మల్లిరెడ్డి, ఈవో రమణ ఆధ్వర్యంలో కానుకల లెక్కింపు జరిగింది. అర్చన టికెట్ల అమ్మకం ద్వారా రూ.73,790, అభిషేకం టికెట్లతో రూ.4200, తలనీలాల టికెట్లతో రూ.31,725, మెరవని రూ.23 వేలు, స్వామివారి కల్యాణం చదివింపుల ద్వారా రూ.22,360, ప్రత్యేక హుండీద్వారా రూ.2,15,800, శాశ్వత హుండీ ద్వారా రూ.4,82,012, తాత్కాలిక హుండీతో రూ.4,23,680, చందాల ద్వారా రూ.33,674, మొత్తం రూ.13,10,241 ఆదాయం వచ్చిందని చైర్మన్, ఈవో తెలిపారు.

సామాన్య భక్తులకు దర్శనం కల్పించండి

లక్కిరెడ్డిపల్లి : జాతరకు వచ్చే సామాన్య భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించేందుకు సిబ్బంది చొరవ చూపాలని అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడు ఎం.సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సర్పంచ్ వెంకట నారాయణ రెడ్డి, చైర్మన్ నరసింహారెడ్డి, ప్రత్యేక అధికారి రవీందర్ రాజులతో కలిసి ఆలయ ప్రాంగణంలో చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ముందస్తుగా తాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ఇప్పటి నుంచి సరి చూసుకోవాలన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా ఎక్కడికక్కడ చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని కోరారు. సామాన్య భక్తులకు క్యూలైన్‌లు ద్వారా అమ్మవారి దర్శనాన్ని కల్పించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మానవత చైర్మన్ బాలసుబ్రమణ్యం , శివశంకర్ రెడ్డి, ఎంపీటీసీ లక్ష్మినారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు లాలూ యాదవ్, నాగేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.



జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆలయ చైర్మన్, ఎంపీపీ మద్దిరేవుల

తొగటవీర క్షత్రియ మండల కమిటీ ఎన్నిక

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లి మండల తొగట వీరక్షత్రియ మండల నూతన కమిటీని ఎన్నుకున్నట్లు అన్నమయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.వెంకటనారాయణ, జి.వెంకటేష్ తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని డి.రామాపురంలో తొగట వీర క్షత్రియ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర తొగటవీర క్షత్రియ అధ్యక్షుడు మోడం వీరాంజనేయ ప్రసాద్, అఖిల భారత తొగటవీర క్షత్రియ ఉపాధ్యక్షుడు రఘురామయ్య, రాయలసీమ అధ్యక్షుడు బొమ్మల రత్నం, కడప జిల్లా అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ, కళ్లే సుధాకర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొగట వీర క్షత్రియ అందరూ ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల నూతన అధ్యక్షుడిగా కొప్పుల శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా బి.రామకృష్ణ, కోశాధికారిగా వి.సుధాకర్‌ను ఎన్నుకున్నారు. అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షుడిగా రాయవరపు రామచంద్రయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ రామచంద్ర, ఉదయగిరి, విజయభాస్కర్, రామాంజనేయులు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.



నూతన కమిటీని సన్మానిస్తున్న దృశ్యం

ఉత్సాహ భరితం.. ఝరి ఉత్సవం

- భారీగా పాల్గొన్న భక్తజనం
- కోనేరులో స్నానం.. భక్తిశ్రద్ధలతో పూజలు
- ఆకట్టుకున్న దేవేరెద్దులు



పీలేరు : కాశీవిశ్వేశ్వరస్వామిని ఊరేగిస్తున్న భక్తులు



కేవీపల్లె : ఝరి ఉత్సవానికి వెళ్తున్న నాణ్యాలు

కలికిరి : మహాశివరాత్రి వేడుకల్లో భాగమైన ఝరి ఉత్సవం ఉత్సాహ భరితంగా సాగింది. శనివారం రాత్రి జాగారణ ఆచరించిన భక్తులు ఆదివారం ఉదయం నుంచి ఝరి(కోనేరు) స్నానాలు ఆచరించి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. మేడికుర్తిలో అగస్త్యేశ్వరస్వామి గ్రామోత్సవం, దేవరెద్దు పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం బాహుదానదిలో ఝరి ఉత్సవం చేపట్టారు. పూలకొండలో వెలసిన మల్లేశ్వరస్వామి, అమ్మవారి కల్యాణోత్సవం జరిగింది. పట్టణంలోని సోమేశ్వరస్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం ఉత్సాహ భరితంగా సాగింది. కార్యక్రమాల్లో సోమేశ్వరాలయ నిర్వాహకులు మహిస్వామి, యల్లారెడ్డి, పుల్లారెడ్డి, పూలకొండ ఆలయ నిర్వాహకులు బాలరెడ్డెప్పనాయునివారు, వెంకటస్వామి, మేడికుర్తి అగస్త్యేశ్వర ఆలయ నిర్వాహకులు రత్నశేఖర్‌రెడ్డి, శ్రీరామిరెడ్డి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అగస్త్యేశ్వరుని సేవలో ఎమ్మెల్యే చింతల

మేడికుర్తి అగస్త్యేశ్వరస్వామిని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి దర్శించుకున్నారు. అనంతరం వారు దేవరెద్దుకు పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చింతల రమేష్‌రెడ్డి, గుట్టపాళెం సర్పంచ్ ఆర్.వెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు అల్లాబక్షు, నాయకులు ఆర్.మధుసూదన్‌రెడ్డి, వరుణ్‌కుమార్‌రెడ్డి, మహేంద్రరెడ్డి, రమణారెడ్డి, డాక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరస్వామి ఊరేగింపు

పీలేరు : స్థానిక శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం శనివారం రాత్రి జాగారణ చేసిన భక్తులతో కిటకిటలాడింది. ఆలయ అర్చకులు విరూపాక్షం కుమారస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆదివారం ఉదయం శ్రీకాశీవిశ్వేశ్వరసామి ఆలయం నుంచి శివపార్వతులను పట్టణంలో ఊరేగించారు. అనంతరం పీలేరు శివారు ప్రాంతం శ్రీచెన్నకేశవ స్వామి ఆలయ సమీపంలో త్రిశూల స్నానం వేదపండితులు మంత్రోచ్చారణ నడుమ నిర్వహించారు. మండలంలోని దొడ్డిపల్లె పంచాయతీ శివరామపురంలో శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు నిర్వహించారు.



కలికిరి: మేడికుర్తిలో దేవరెద్దు పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

లక్ష్మీకామేశ్వరస్వామి దేవాలయంలో..

వాల్మీకిపురం: స్థానిక కోనేటివీధిలో ఉన్న శ్రీ లక్ష్మీ కామేశ్వరస్వామి దేవాలయంలో ఉదయం అభిషేకం, అర్చన, హోమాలు చేశారు. ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కోనేటివీధి, నిమ్మనపల్లె రోడ్డులోని దేవాలయాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. నిమ్మనపల్లె రోడ్డులోని ఉమామహేశ్వరస్వామి ఆలయం, వీరన్న కొండపై ఉన్న వీరభద్రస్వామి ఆలయం, పాతమంచూరు ఆంజనేయస్వామి ఆలయం, పడమర పాలిమేర ధర్మపథంలో ఉన్న శ్రీలింగోద్భవ మహాశివుడికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించి, నగరోత్సవం నిర్వహించారు. పడమర ధర్మపథంలో శివపార్వతుల కల్యాణోత్సవం అనంతరం నూతన వధూవరులను రథోత్సవంపై అధిరోహింపజేసి నగరోత్సవం నిర్వహించారు. మండలంలోని చింతపర్తిలో శ్రీ ఓబులేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చింతల ఆనందరెడ్డి, కేశవరెడ్డి, కువైట్ శంకర, మానవతా సంస్థ అధ్యక్షులు క్రిష్ణమూర్తి, అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, గోనవరపు శీనాస్వామి పాల్గొన్నారు.

మండల సరిహద్దులో..

కేవీపల్లె : కలకడ, కేవీపల్లె మండలాల సరిహద్దులోని ఝరికోన ఉత్సవానికి మండలం నుంచి అధిక సంఖ్యలో నాణ్యాలు, దేవేరెద్దులతో భక్తులు తరలివెళ్లా రు. కేవీపల్లె మండలంలోని వంకవడ్డిపల్లె, తోటిదళితవాడ, చిన్నకమ్మపల్లె, గుట్టలపై గ్రామం, మార్రేళ్ల, నారమాకులవడ్డిపల్లె తువ్వపల్లె, గువ్వలగుడ్డెం, గాలివారిపల్లె తదితర ప్రాంతాల నుంచి దేవరెద్దు లు, నాణ్యాలు పెద్ద ఎత్తున తీసుకువెళ్లారు.

కూరగాయ ధరలు పైపైకి!

కడప అగ్రికల్చర్: కూరగాయల ధరలు మళ్లీ మెల్లగా ఎగబాకుతున్నాయి. దీంతో సామాన్యులపై ఆర్థికంగా భారం పడనుంది. మొన్నమొన్నటి వరకు కిలో టమాట పది రూపాయలు ఉండగా ప్రస్తుతం 25 రూపాయలకు చేరుకుంది. దీంతో పేద, మధ్య తరగతి వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. మిగతా కూరగాయల ధరలు కూడా అధికంగానే ఉన్నాయి. మన ప్రాంతంలో టమాట సీజన్ తగ్గడంతోపాటు మదనపల్లె, గుర్రంకొండ ప్రాంతాల నుంచి టమాటాలను రైతుబజార్‌కు దిగుమతి చేసుకోవడమే ధరలు పెరగడానికి కారణమని వ్యాపారులు అంటున్నారు. దీంతోపాటు ఇతర కూరగాయలైన బీన్స్, క్యాప్సికమ్ కూడా కిలో రూ. 50 ధర ఉంది. అలాగే క్యారెట్, వంకాయ, కాలిఫ్లవర్, బీరకాయ, బజ్జి మిరపకాయలు కిలో రూ. 40 ధర పలుకుతున్నాయి. కందగడ్డ, చామగడ్డలు కూడా కిలో రూ. 40 పలుకుతున్నాయి.

ఓపెన్ జిమ్ ఏర్పాటుకు చర్యలు

కడప స్పోర్ట్స్: నగరంలోని డీఎస్‌ఏ క్రీడామైదానంలో నిరుపయోగంగా ఉన్న చిల్డ్రన్స్ పార్క్‌లో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కడప నగరపాలక సంస్థ కమిషనర్ జి.సూర్యసాయిప్రవీణ్‌చంద్ ఆదేశించారు. ఆదివారం సాయంత్రం కడప నగరంలోని డీఎస్‌ఏ క్రీడామైదానాన్ని కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ ఇండోర్ ఆవరణలో అధునాతన జిమ్‌సెంటర్‌ను మరో వారంరోజుల్లో అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.